ఇది కథలా కరిగిన జీవితం. కలలా కరిగిన జ్ఞాపకం.
నిజమై ఎరిగిన సావాసం. ప్రేమ మరిగిన నమ్మకం.

మోహిత

# 2

# తొమ్మిదో నెంబరు చంద్రుడు





"అమ్మా!" ప్రతిధ్వనించింది నా కేక ఆ విశాల ఏకాంత భవనంలో. డాక్టర్లుగానీ నర్సులుగానీ మానవమాత్రులెవరూ లేరా ఇక్కడ? ఏమిటీ నరకయాతన? ఈ బాధ ఏంటో తట్టుకోలేకపోతున్నాను. ఏదో ఉంది గుండెలో. అది బయటకు రావటానికి శ్వాస కుహరంలోంచి దారి లేదని తెలుస్తోంది క్లియర్‌గా. ఇదేంటో నా శరీరంలోకి ఎలా చేరిందో నాకేమీ అర్థం కావటం లేదు. కానీ ఎంత మెత్తగా మౌనంగా మల్లెలు విచ్చుకున్నట్టు నాలోకి ఇంకిపోయింది? మరిప్పుడేంటి ఇలా బండలా తయారైంది? ఎంత ముక్కినా మూలిగినా బయటపడదే?

"అమ్మా!"

మీకు బహుశా నేను అరిచింది అమ్మా అని వినపడి వుంటుంది. హహ్హహ్హా చెవిటివాళ్లలారా! నేను అరిచింది, 'శశీ!' అని. మెలిక శ, మెలిక శకి గుడిస్తే శి-శశి. ఆ మెలికలే వేశాడు నా మనసుకి. ఎక్కడో పీటముడి- అహో-బ్రహ్మముడి పడిపోయింది. విప్పదీద్దామని శతథా ప్రయత్నించాను. ఊహు ముడి ఆనవాలే దొరకలేదు. దారం కట్టి ఆడించే తోలు బొమ్మలాట ఆడుకొనీ ఆడుకొనీ విసుగెత్తి వదిలేసి వెళ్లిపోయాడు. మెలికల్లో చిక్కుకుపోయిన నా మనసును విడిపించు కోవటం కష్టంగా ఉంది. ఓయ్ ఇదేంటి, ఈ కష్టం కూడా ఇంత ఇష్టంగా ఉంది?

✤

"ఆర్యూ ఎ ఫ్రెషర్?"

ఏ ఉద్యోగానికి వెళ్లినా ఎదురయే ప్రశ్న ఇదే. ఎస్, ఐ యామ్ ఎ ఫ్రెషర్. ఇప్పుడే ఫ్రెష్‌గా పూసిన పువ్వుని. కాలేజీ తోటలోంచి మీ ఆఫీస్ ఫ్లవర్‌వేజ్‌లో చేరటానికి వచ్చిన కోమల సుమబాలని. జీతం బానే ఉంది. రంగురంగుల పూలని ఇంత అందంగా అమర్చవచ్చా అని నేను అచ్చెరువొందాను. నాకన్నా బాగున్న, నాజూగ్గా ఉన్న, అక్కడ ఎంతో కాలంగా ఉన్న కుసుమాంగనలను చూసి ఈర్ష్యపడ్డాను. ఫార్మల్స్‌లో తెలివైన ముఖాలతో చిరునవ్వులు చిందిస్తూ హుందాగా

కదలాడే తుమ్మెదల్నీ చూశాను. అరె, ఈ తుమ్మెదకి కళ్లజోడు ఉందా! ఎంత బావున్నాడు? పేరు శశి అట! నేనా, కలువజాతికి చెందిన దాన్ని. అతని చూపుల చంద్ర కిరణాలు సోకగానే ఈ కలువభామ వికసించింది. ఆ వికాసం అతనికీ చాలా ముచ్చటగొలిపిందని గారాలుపోతున్న అతని వాలకం తెలిపింది.

✤

నిండైన చంద్రుని అమృతధారల్ని చక్రవాక పక్షులు పోగుచేసుకోవటంలో నిమగ్నమైన వేళ- ప్రకృతి పులకరించి పరవశించి పవళించే శీతల యామినిలో నేను పుట్టానుట. పుట్టిన వెంటనే కిటికీలోంచి చంద్రుని చూసి కిలకిలా నవ్వానుట. పూర్ణిమ అని నాకు నామకరణం చేద్దామనుకొని చంద్రుని చూసి ఇంత అబ్బురపడుతోంది, మోహవశురాలైంది అని నా తల్లిదండ్రులు 'మోహిత' అని పిలుస్తున్నారు. అలా మొదలైంది చంద్రునితో నా ప్రణయం.

నా ముద్దుల మోము వల్ల చంద్రముఖినీ, చంద్రరేఖ వంటి కనుబొమల వలన 'శశిరేఖ'నూ, చల్లని చిరునవ్వు వలన శరత్‌చంద్రికనూ అయ్యాను. పాలన్నం చందమామ కంచంలో కలిపిస్తేనే తినేదాన్నట. అమావాస్య రోజుల్లో దిగులుగా వుండే దాన్నట. ఆకాశంలో మబ్బుల చాటున చంద్రుడి కోసం వెతికేదాన్నట. చందమామ కథలు చదువుతూ ఏనాటికైనా నా సరిజోడు వెన్నెలరేడని ఫిక్స్ అయిపోయాను. ఏనాటి మాట అది! సిండ్రెల్లా ఆఫ్ ఫెయిరీ టేల్స్. ఆ ఊహలే నాతోపాటు పెరిగి పెద్దవై వేళ్లూనుకొని పోయి అవే నా అస్తిత్వం అయిపోయాయి.

✤

"శశీ...!!"

రౌరవాది నరకాల్లో ఖచ్చితంగా ఇంతకన్నా తక్కువ శిక్షే ఉంటుంది. గరుడ పురాణంలో వర్ణించిన అన్ని హింసల్లో ఈ టైపు హింస లేనేలేదోయ్! గుండెల్లో కలుక్కు మనట్లేదు. సూదులు, శూలాలు పెట్టి పొడుస్తున్నట్టు లేదు. వెడల్పైన బండరాయితో మోదుతున్నట్టుంది. లార్జర్ ద ఫోర్స్, గ్రేటర్ ద పెయిన్.

✤

ఎవరు నేను? నా జీవితంలో పౌర్ణమి ఎప్పుడు? జాబిలికూన బుగ్గలపై వెన్నెల మరకలు అంటించేదెపుడని కళ్లు కార్తీకదీపాలై నిరీక్షిస్తుంటాయి.

ఓ, సారీ! నా గురించి నేను చెప్పుకోలేదు కదూ? నా పేరు మోహిత, దగ్గరి వాళ్లు 'మోహీ' అంటారు, దూరంవాళ్లు 'హితా' అంటారు. ఐ యామ్ ఏన్ ఏరోనాటికల్

ఇంజనీర్. బహుశా చిన్నప్పటి నుంచి ఆకాశంలో చంద్రుణ్ని అందుకోవాలనే కోరికే నన్ను ఇలా ఏరోనాటికల్ ఇంజనీర్ని చేసిందేమో! రోల్స్ రాయిస్ ముంబై బ్రాంచ్‌లో పనిచేశాను. ప్రస్తుతం బేకార్, అంటే ఈ పడక సీను అన్నమాట.

నాది మిథునరాశి. ద్వంద్వ ప్రవృత్తి. ఒక విషయాన్ని రెండు కోణాల్లో చూడటం, మూడ్‌ని బట్టి ఏడవటం, నవ్వటం, కోప్పడటం, అతిగా తినటం, రోజుల తరబడి ఉపవాసం ఉండటం- ఇవీ నా హాబీస్. పుస్తకాలు చదువుతాను, సినిమాలూ చూస్తాను. స్నేహితులతో జాలీగా గడుపుతాను, ఒంటరిగా కూర్చొని కుములుతాను. కుర్‌కురే తింటూ హారీ పోటర్ చదవటం ఎంత ఇష్టమో పరగడుపున స్కై డైవింగ్ చెయ్యటం కూడా అంతే ఇష్టం. నా రికార్డ్స్ నేనే బ్రేక్ చేసుకుంటాను. వేరేవాళ్లకి ఆ అవకాశం ఇచ్చి వాళ్లని కష్టపెట్టటమెందుకు చెప్పండి? ఇంజన్ స్ట్రక్చర్, థెర్మో డైనమిక్స్ మీద ఎంత పద్ధతి ప్రకారం ఫైల్స్ మెయిన్‌టైన్ చేస్తానో, నా పర్సనల్ డైరీ కూడా అలాగే మెయిన్‌టైన్ చేస్తాను.

✤

నాతో నేను ప్రేమలో పడిందగ్గర్నుంచి అతని ప్రేమలో పడేలోపు మధ్య బోల్డంత ప్రాసెస్ జరిగిందోచ్!

ఆడపిల్లనన్న ఊహ తెలిసిన మొదటిక్షణంలోనే నాతో నేను ప్రేమలో పడ్డాను. నాకు నేనంటే చాలా ఇష్టం. ఒక్కోసారి నా గురించి నేనే 'హాచ్చెర' పోతుంటాను. ఎంత చిన్నపిల్లలాగ ప్రవర్తిస్తాను అని. ఒక్కోసారి, 'ఎంత ఎదిగిపోయావు మోహీ, ఇంకెవ్వరు నీలా చెయ్యలేరు,' అని భుజం తట్టుకుంటుంటాను.

ట్రైనింగ్‌లో, 'డిడ్ యు ఎవర్ ఫాల్ ఇన్ లవ్,' లేదా, 'హూ ఇజ్ యువర్ ఫస్ట్ క్రష్?' లాంటి ప్రశ్నలు వేసే వాళ్లు. 'ఐ యామ్ మై ఫస్ట్ లవ్' అని చెప్తే ఢిల్లీ బ్రాంచ్‌వాళ్లు వింతగా చూశారు. అందుకని ముంబైలో 'మిస్టర్ ఎక్స్' అని చెప్పేదాన్ని. వాళ్లు శాటిఫై అయిపోయారు. ఏంటో ఈ పిచ్చిలోకం, నిజం చెప్తే తట్టుకోలేదు, అబద్ధం చాలు అని లాలూచి పడిపోతుంది!

సో, నాతో నేను ప్రేమలో పడ్డప్పుడు నేను స్త్రీనని గుర్తించాను. ఇప్పుడు నేనూ ఒక స్త్రీనని గుర్తుచేసిన ఒక పురుషుడి ప్రేమలో పడ్డాను. హలో హలో, నేను వయసు పొంగుల గురించి చెప్పట్లేదబ్బా... మనసు హంగుల గురించి చెబుతున్నాను.

✤

శశీ ఏనాటి బంధం మనది? ఎక్కడో చదివాను ఆత్మ రెండు ముక్కలుగా పుడుతుందిట. వాళ్లే భార్యాభర్తలు అవుతార్ట. నా రెండో ముక్క కోసం వెతుకుతుంటే జిగ్ సా పజిల్‌లో సరిగ్గా అమరిపోయిన ముక్క నీదేనోయ్! ప్రకృతీ పురుషుల మానస సరోవరంలో ఎగసి నేల మీదకు చిందిన అమరజలంలో రెండు బిందువులు నువ్వు నేనూ.

అయస్కాంతంలో ఉత్తర దక్షిణ ధ్రువాలు మాట్లాడుకోనక్కరలేదు. పరిగెత్తుకుంటూ ఉరకలేస్తూ ఉవ్విళ్లూరుతూ ఒకదానికొకటి అంటుకుపోవాలని తహతహలాడుతూ వచ్చి టప్‌మంటూ ఒకటవుతాయి. పరిమిత దూరం వచ్చాక ఆ ఎట్రాక్టివ్ ఫోర్స్‌ని అవి కూడా ఆపలేవు. అంత శక్తివంతమైనది, అమోఘమైనది, బలీయమైనది ఆ బంధం! మాగ్నెట్‌కే నాలాగా మాటలొచ్చుంటే ఆప్టిమం డిస్టెన్స్‌కి చేరుకున్నాక ఎవరైనా అడ్డగిస్తే గిలగిల తన్నుకొని విరహవ్యధలో గబగబా నాలుగైదు ప్రబంధ కావ్యాలు రాసేస్తుంది!

శశి గురించి చెప్తానని మాగ్నెటిక్ పుల్ గురించి చెప్తున్నాను. ఇంజనీర్ని కదా. పైగా భావుకురాల్ని. సైంటిఫిక్ ఈక్వేషన్స్‌తోటే ఏ విషయం అయినా తలకెక్కుతుంది నాకు. అలాగే ఇదీనూ. శశి వెచ్చని గూడు. నేను మంచు తుఫానులో చిక్కుకున్న మిణుగురు పురుగు. శశి దీపం. నేను శలభం. శశి వసంతం. నేను వసంతంలో కూసే కోయిల. సంతోషం మనసు తలుపు తడితే శశి, మోహం మరులు గొలిపితే శశి, విరహం ముప్పిరిగొంటే శశి, మౌనం ముసురుకుంటే శశి, మాటలు వరదలైతే శశి. శశి శబ్దం, నేను అర్థం. శశి ప్రాణం, నేను ప్రణవం.

✤

శశీ... శశీ...

ఎంత కాలం ఈ బాధ ? ఏమిటింత నొప్పులు? ఏం కావాలో నీకు అడిగి తీసేసుకో. హింస పెట్టకు. నువ్వూ నేనూ ఒకటే అనుకున్నాను. ఈ కన్వల్షన్స్‌లో తెలుస్తోంది- బాధపడుతోంది నేనేననీ, నువ్వు దూరం నుంచి పకపకా నవ్వుతున్నావనీ... ఐదు సంవత్సరాల నుంచి ఇదే బాధ! హయ్యో బాధైనా కొత్తది అయితే ఇంకొంత కాలం భరించేదాన్ని. ఈ పాత బాధని, పాచి పట్టిన దుఃఖాన్ని పదేపదే... ఎన్నాళ్లిలా?

✤

'మోస్ట్ బ్యూటిఫుల్ వుమన్ ఆన్ ద ఫ్లోర్'గా ఎన్నికైన రోజు- 'కంగ్రాట్స్ డియర్,' అంటూ మొదటిసారి నా హ్యాండ్ షేక్ చేశావు. నన్ను ముట్టుకోవటానికి అదొక నెపం

అనుకొని నేను పట్టించుకోలేదు. పుట్టినరోజునాడు అందరికన్నా ముందు నువ్వు విషెస్ పంపితే ఆస్వాదించాను. రోజూ స్కర్ట్ అండ్ షర్ట్స్‌లో ఉండే నేను ఆరోజు చేతుల నిండా గాజులు వేసుకొని, నాకిష్టమైన లావెండర్ కలర్ పంజాబీ డ్రెస్‌లో నుదుట తిలకం, కుంకం బొట్టు, తలలో పూలతో వస్తే చూపులు తిప్పుకోలేకపోయావు. నేను గమనించలేదనుకున్నావేమో!?

చిన్నదో పెద్దదో ఏ బంధంలో అయినా శారీరక ఆకర్షణ తప్పకుండా ఉండి తీరుతుంది. ఆరడుగుల అందగాడివి, నా హీరోవి- నీకు పడిపోకుండా ఉండాలని చాలా ప్రయత్నించాను శశీ. నీ ప్రయత్నాలు వ్యర్థమైనాయని నిరాశ చెందుతున్నావని గుర్తించి, 'నన్ను ఇంటి దగ్గర డ్రాప్ చేస్తావా?' అని అడిగాను. కంపెనీ కార్‌నీ, సెక్యూరిటీనీ అన్నీ వదిలేసి ఆ అర్ధరాత్రి పూట చలిలో (నైట్ షిఫ్ట్) అంత దూరం నీతో వచ్చెయ్యటానికి సిద్ధపడ్డాను. మొట్టమొదటిసారి ఒక వ్యక్తిని పరిపూర్ణంగా నమ్మాను. నీ బైక్ మీద గాలిని చీల్చుతూ వెళుతుంటే అస్సలు కొత్తగా అనిపించలేదు. స్కర్ట్ వల్ల వన్ సైడ్ కూర్చున్నాను. నా భుజం నీకు తగులుతోంది. ఎత్తైన బిల్డింగ్స్ మీద నుంచి చంద్రుడు కనపడట్లేదు.

"అబ్బ! ఇంత ఎత్తు బిల్డింగ్స్ ఎందుకు కడతారో వేస్ట్ ఫెలోస్, చంద్రుణ్ణి కనపడనీయకుండా!" విసుక్కున్నాను.

"ఆ చంద్రుడు లేకపోతే ఏం? ఈ చంద్రుడున్నాడుగా?" అది విని ఆశ్చర్యంతో కళ్లు ఆల్చిప్పల్లా తెరుచుకున్నాయి. అవును సుమీ, ఇన్నాళ్లు ఆకాశంలోని వాడే చంద్రుడనుకున్నాను!

'మీ భర్త ఎలా ఉంటారు?'

'ఆయన తెల్లగా గుండ్రంగా బంతిలా ఉంటారు, లెఫ్ట్‌సైడ్ మచ్చ ఉంటుంది, 15 డేస్‌కి ఒకసారి సన్నబడుతుంటారు, లావవుతుంటారు.' ఫక్కున నవ్వొచ్చింది నాకు.

"ఏంటీ నవ్వుతున్నావు?"

"ఏం లేదు."

"నీకేం అనిపించటం లేదా?"

"ఏమనిపించాలి?"

"కొంచెం దగ్గరికి జరుగు."

గుండె ఝల్లుమంది.

*వద్దు, నాలో ఘనీభవించిన తంత్రుల్ని మీటద్దు !*
*నాలో ప్రేమ పొంగించద్దు.*

నన్ను ఇలానే ఉండనీ.

వేయి రాత్రుల వెనుక ఓ మనసుతో ఇదే సాన్నిహిత్యం.

కలలన్నీ భళ్లున రాలాయి బద్దలై వేయి వ్రక్కలై.

'లక్షణమైన కుర్రాడు. నీతో పాటే ఉద్యోగం చేస్తున్నాడంటే మంచిదేగా. నీ మీద ఇంట్రెస్ట్ కూడా చూపిస్తున్నాడు. మరి ఏమొచ్చింది వద్దు వద్దు అంటున్నావు?'

ఇదేగా మీ ప్రశ్న? నా నిర్లిప్తతకి ఎనిమిది ఫ్లాష్‌బాక్స్ ఉన్నాయి.

✤

ఫస్ట్‌క్లాస్‌లో...

సరోజ్‌కాంత్ చాలా ముద్దుగా ఉండేవాడు. గడ్డం మీద పుట్టుమచ్చ, ఎర్రటి పెదవులు, దూరదర్శన్‌లో వార్తలు చదివే ఆవిడ కొడుకవటం- అబ్బో గ్లామర్‌కి అన్నీ తోడయ్యాయి. మేమిద్దరం బెస్ట్ ఫ్రెండ్స్. మా క్లాస్ ఎదురుగా కాగడా మల్లెల మొక్క ఉండేది. పూలంటే నాకు పిచ్చి. స్కూలయ్యాక, క్లాస్ లీడర్‌ని కాబట్టి ఎవరైనా ఏమైనా మర్చిపోయారా, ఎవరు బెంచ్ కింద ఎక్కువ పేపర్లు చింపి పడేశారు వగైరా పనులుండేవి. ఎవరూ చూడట్లేదనుకున్నాక కాగడా మల్లెలు గబగబా కోసి కర్చీఫ్‌లో మూటగట్టి బాగ్‌లో దాచేసి రిక్షా కోసం పరిగెత్తేదాన్ని.

ఒకరోజు ఎందుకో సరోజ్ నాకు హెల్ప్ చేస్తూ ఉండిపోయాడు.

"వెళ్లూ."

"రిక్షా లేదు, మా మమ్మీ వస్తుంది."

"ఎందుకు? నిర్మల టీచర్ కొట్టారనా?"

"మా మమ్మీకి ట్రాన్స్‌ఫర్ అయింది. మేం ఈ ఊరు వదిలి వెళ్లిపోతున్నాం."

"అక్కడ మంచి స్కూల్ ఉందా? మంచి ఫ్రెండ్స్ ఉంటారా?"

"ఏమో, నీలాంటి క్లాస్ లీడర్ ఫ్రెండ్‌గా ఉంటే చాలు."

నాకెలాంటి ఫీలింగ్స్ కలిగాయో గుర్తులేదు. గుర్తులేదేమిటి నా మొహం! గుర్తించలేదు. ఏడేళ్ల వయసులో ఫీలింగ్స్ గుర్తించగలిగే మెచ్యూరిటి లేదు. తర్వాత తనూ పూలు కోశాడు. మల్లెపొద దగ్గర మాటలు వినిపించి వాచ్‌మాన్ విజిల్ వేస్తూ వచ్చాడు. కోసినన్ని చాలని తుర్రుమన్నాం. అదే లాస్ట్! ఇప్పటికీ అతని అమాయకపు కళ్లు, యూనిఫాం డ్రెస్, షూస్, దువ్విన తలని నీట్‌గా ఉంచుకునే ప్రయత్నం చేయటం, మల్లెలు నా కర్చీఫ్‌లో వెయ్యటం గుర్తొస్తాయి. పడమటికి దిగిపోతున్న

సూర్యుడిలా నా జీవితపు సముద్రంలో ఓ స్నేహం ఇంకిపోయింది. బహుశా అతను నా మొదటి చందమామ అనుకుంటా.

✤

సెవెంత్ క్లాస్‌లో...

క్వార్టర్లీ ఎగ్జామ్స్ రాయలేదు నేను. పదిరోజుల తర్వాత స్కూల్‌కి వచ్చాను. అమ్మాయిలు ముసిముసిగా నవ్వుకోవటం చూసి అబ్బాయిలు తెల్లమొహాలు వేశారు. జ్వరం వచ్చినా ఒక్కపూట కూడా మానేయని నేను, ఏకంగా పరీక్షలే ఎగ్గొట్టానంటే ఎవరూ నమ్మలేని నిజం అది.

క్లాస్ సెకండ్ లీడర్ ప్రతీక్ లంచ్‌లో అడిగాడు ఎందుకు రాలేదని. చిన్నప్పట్నుంచి కూడా నేను కథలు బాగా చెబుతానని పేరు. రాత్రిళ్లు కరెంట్ పోతే స్నేహితులు నా కథ కోసం చుట్టూ చేరేవాళ్లు. చందమామ, బాలజ్యోతి, బాలమిత్ర, బుజ్జాయి, బాలభారతి, వండర్ వరల్డ్ , చిల్లన్స్ వరల్డ్- యు నేమ్ ఇట్, ఐ హావ్ రెడ్ ఇట్! వీటిలో కథలకి నా కల్పనాశక్తి జోడించి చిలవలు పలవలు చెప్తూ పోవటమే! అందరూ నోరెళ్లబెట్టి వినేవాళ్లు.

కానీ ప్రతీక్‌కి నేను కథ చెప్పలేదు, అబద్ధం చెప్పాను ఫీవర్ అని. మొదటిసారి ఒక రహస్యాన్ని కప్పిపుచ్చిన నాకు నిజంగానే పెద్ద అయిపోయిన ఫీలింగ్ కలిగింది. పదిరోజుల తర్వాత నన్ను చూశాడన్న సంతోషాన్ని అతని కళ్లు చెప్పకనే చెబుతుంటే అర్థం కాని ఫీలింగ్. ఆ తర్వాత మేము వేరే ఊరు వెళ్లిపోవటం వల్ల అతన్తో స్నేహం హద్దులు దాటే అవకాశం లేకపోయింది.

✤

టీనేజ్ మొదటి సంవత్సరంలో...

పవన్‌కీ నాకూ టాలెంట్ సెర్చ్ ఎగ్జామ్‌లో గోల్డ్ మెడల్ వచ్చింది. అప్పట్నుంచీ ప్రతి పనిలో మేము పార్టనర్స్ అనే ఫీలింగ్. నీ గోల్డ్ మెడల్ లో సగం నాది అనేదాన్ని అతను బ్లాక్ జీన్స్ వైట్ కాలర్ టీషర్టు వేసుకుంటే కళ్లు చెదిరేవి. ప్రతి పోటీలో అతన్ని ఓడించి నేను గెలవటం థ్రిల్లింగా ఉండేది. నాకన్నా అర మార్కు ఎక్కువ తెచ్చుకున్నా చాలా రోషపడేదాన్ని.

అతని గురించి ఎంత గాఢంగా కలలు కనేదాన్నంటే అవి కనురెప్పల పై నుంచి వేరేవాళ్లకు సినిమాలాగా కనబడతాయేమో అని డౌట్ వచ్చేసి కళ్ల మీద చేతులు

అడ్డం పెట్టి దుప్పటి నిండా ముసుగేసుకొని పడుకునేదాన్ని. నా సోల్‌మేట్ గురించిన ఆలోచనలు బహుశా అప్పటినుంచి మొదలయ్యాయేమో.

ఒకసారి కలలో పవన్ని పట్టుకుందామని వెళుతుంటే అతను వెనక్కి తిరిగి నా చేతుల్లో గాజుబల్బు పెట్టాడు. నేను జాగ్రత్తగా పట్టుకొని గుప్పిట మూస్తున్నాను, అది భళ్లున పగిలిపోయింది. అరచేతుల నిండా గాజుపెంకులు గుచ్చుకుపోయి రక్తం ధారలుగా కారుతోంది. నొప్పి, బాధ ఏంలేవు గానీ ఆ బల్బ్ భళ్లున పగిలిన శబ్దం మాత్రం వారంరోజుల వరకూ చెవుల్లో గింగురుమంటూనే ఉంది. ఇందాక కవిత చెప్పానే, కలలన్నీ భళ్లున పగిలాయి అని, అది ఇదే!!

✤

అమ్మో! దేవుడా! అసలున్నావా నువ్వు? నీ మొహం మండిపోనూ... ఏం దేవుడివయ్యా నువ్వు? మనోనిశ్చయంతో తపస్సు చేస్తే ప్రత్యక్షమౌతావని చెప్పుకుంటారే? మరి ఏది? ఎక్కడున్నావు? మూడేళ్ల నుంచి అహరహమూ చేస్తున్న తపస్సు ఫలించదా? నా ఆయుష్షు 85 ఏళ్లుట. అందులో మూడేళ్లు- అదీ కెరీర్లో పైకెదగాల్సిన కీలక సమయంలో మూడేళ్లు- నీకు కేటాయించానే, ఎక్కువ కాదా? ఏదైనా తెగే దాక లాగకూడదు. నా ఊపిరి తీగలు, కడుపులో పేగులు తెగేదాకా లాగుతున్నావు. ఎందుకో ఏమిటో కొంచెం చెప్పి ఏడవచ్చుగా!

నాన్సీ డ్రూ నుంచి అగాథా క్రిస్టీకి, టామ్ సాయర్ నుంచి జేమ్సుబాండ్‌కి, చందమామ నుంచి స్వాతికి. జంగిల్ బుక్ నుంచి కాశీమజిలీ కథలకి, అరేబియన్ నైట్స్ నుండి డిస్కవరీ ఆఫ్ ఇండియాకి ఎదిగాను. ఏం లాభం? ఒక్క మెడికల్ జర్నల్ అయినా చదవలేదే. డార్విన్స్ థియరీ ఆఫ్ ఎవల్యూషన్, థియరీ ఆఫ్ సెలెక్టివ్ మేటింగ్, ఐన్‌స్టీన్స్ స్పెషల్ థియరీ ఆఫ్ రిలేటివిటీ, ష్రాడింగర్స్ వేవ్ ఈక్వేషన్ తెలిసినట్టు ప్రేమలో కూడా ఏవైనా థియరీస్ థీరమ్స్ ఉంటే వెంటనే చదివేసి పర్ఫెక్ట్ అయిపోతా. సజెస్ట్ ఎ లైబ్రరీ యార్.

ఓ గాడ్! కెన్ యు గివ్ మి ఎ పెయిన్ కిల్లర్ ప్లీజ్?

✤

పదేళ్ల పాటు పవన్ గురించిన ఆలోచనలు తప్ప ఇంకేం లేవు. పదేళ్ల తర్వాత ఆ ఇంటెన్సిటీ, ఫ్రెష్‌నెస్ ఆఫ్ థాట్ లేవు. పవన్, నేను రెండు సంవత్సరాలు స్కూల్లో కలిసి చదివాం. అతను బిట్స్ పిలానీకి వెళ్లాక రెండు మూడు ఉత్తరాలు రాశాను. తర్వాత రెండు మూడు ఈ-మెయిల్స్ అంతే. అదీ, నాకు రాయటం అంటే ఉన్న

ఆసక్తి వల్ల. ఆఖరి మెయిల్‌లో థార్ ఎడారి నుంచి తన గుర్తుగా కొంచెం ఇసుక తెచ్చివ్వమని అడిగాను. ఇదేదో బాగా ముదిరిన మెంటల్ కేసు అనుకున్నట్టున్నాడు, ఇంక రిప్లై లేదు. రెండేళ్లు ఎదురు చూసి ఫ్రెండ్‌షిప్ డేకి బ్రేకప్ మెయిల్ పంపాను. అది నాలుగు పేజీల ఉత్తరం కానీ సమ్మరీ మాత్రం 'గెట్ లాస్ట్' అని రెండే రెండు ముక్కలు. ఎవరో ఒకళ్లకి సిగ్గుండాలి. కొండరాళ్లతో దిట్టంగా కట్టిన గోడ(లాంటి నీ)కేసి తల బాదుకోవటంలో నా తల పగలటం తప్ప నీ ఫ్రెండ్‌షిప్ ఒరగబెట్టినదేమి లేదు అని చెప్పాను.

గుండె చిట్లింది మొదటిసారి. బాధ లీకైంది. ఆరోగ్యం చెడింది. నేనెందుకంత ఒంటరితనం అనుభవిస్తున్నానో తెలిసేది కాదు. అందరిలో ఉంటే దూరంగా పారిపోయి ఒక్కదాన్నే ఉండాలనిపించేది. ఒంటరిగా ఉంటే, గుబులు నన్ను సాలె గూటిలా అల్లుకుంటుంటే, అవన్నీ తెంపేసి నేను బందీని కాను, స్వేచ్ఛాజీవిని అని అరవాలనిపించేది.

అప్పుడే నేను ఫ్లూయిడ్ మెకానిక్స్‌లో ఆల్ ఇండియా టాపర్ అయ్యాను. పేపర్లో ఫోటోలు, స్నేహితుల అభినందనలూ, ప్రొఫెసర్ల సలహాలూ ఎట్సెట్రా. ఇంత జరుగుతున్నా సంతోషం పంచుకోవటానికి ఎవరూ లేరు అనిపించేది. కలలు కనలేని తనం. ఒక రాయిలాగా బ్రతికాను.

✤

ఇన్ మై లాస్ట్ టీన్...

చందు ఐఐటి ఖరగ్‌పూర్‌లో చదువుతున్నాడు. యాహూలో పరిచయం. మేం ఎప్పుడూ కలుసుకోలేదు. ఫీల్ మై లవ్ అంటుంటాడు. నేను దేశంలోనే ప్రథమ ర్యాంకు పొందానంటే ఆశ్చర్యపోయాడు.

"ఎలా సాధ్యం?"

"ప్రతిభావంతులంతా నీలాగే ఐఐటిల్లో మురిగిపోతారా ఏంటి."

"నువ్వు ఐఐటిలో లేనందువల్ల దేశం చాల చాల మిస్సయ్యింది."

ఐఐటి మిస్సయ్యిందో అతను మిస్సయ్యాడో అర్థం కాలేనంత అమాయకు రాల్ని కాదు. ఫోన్‌లో మాట్లాడుతుంటే ఊ కొట్టడం కూడా ఆపేసి వినేవాడు. పొద్దున్నే నిద్రకళ్లతో ఫోన్ ఎత్తగానే ఏదో జోక్ వేసేవాడు. నేను నవ్వగానే నీ నవ్వు వింటూ ఎన్నాళ్లైనా ఇలా ఉండిపోవచ్చు అనేవాడు. 'ఏం మంత్రం వేశావమ్మా మోహితా మా వాడి మీద? ఎప్పుడూ దిండు పట్టుకొని నీ పేరే జపం చేస్తుంటాడు,' అని చందు

ఫ్రెండ్స్ ఒకసారి ఫోనులో చెప్పారు. నా మీద నాకే అపనమ్మకం కలిగింది. నేనేంటి ఒక అబ్బాయిని ప్రేమలో పడెయ్యటం ఏంటి?

మా పరిచయమైన సంవత్సరం తర్వాత ఒకసారి ఫోన్లో ముద్దు పెట్టమని అడిగాడు. అప్పుడు నా మనసులో ఇంకా పవనే ఉండటం వల్ల ఇలాంటి వ్యవహారాలు కుదరవనీ ఐ లవ్ సమ్‌బడి ఎల్స్ అనీ చెప్పాను. 'నేను ఎంత క్లోజ్‌గా ఫీల్ అవ్వకపోతే ఆ మాట అడుగుతానో అర్థం చేసుకోలేవా?' నిజాయితీతో కూడిన దైన్యం, నైరాశ్యం అతని గొంతులో వినిపించాయి. నిష్కర్షగా కాలదన్నాను. 23 సంవత్సరాల ఒక మగవాడు, ఐఐటి జెఈఈలో ఆరవ ర్యాంకు పొందిన ఒక మేధావి చిన్నపిల్లాడిలా ఏడ్చాడు. అతనెంత సెన్సిటివ్ ఫెల్లోనో అర్థమైంది. ఛ ఛ అతన్ని ఏడిపించాను. తప్పు చేశాను! తప్పు చేశాను!

✤

ఇప్పుడు అర్థమవుతోంది రిట్రాస్పెక్షన్‌లో. నాకు ప్రేమ ఇవ్వటమే తప్ప తీసుకోవటం చేతకావటం లేదు. ఎవరన్నా కొంచెం కన్సర్న్ చూపించి 'భోంచేశావా?' అని అడిగితే బెంబేలెత్తిపోతున్నాను ఇది ఎక్కడికి దారితీస్తుందో అని.

తలుపులు మూసేశాను. గెటౌట్! వెళ్లిపొండి! ఎవరూ ఉండద్దు ఇక్కడ! ఇది నాది. ఇక్కడ నేనే ఉంటాను. ఒంటరిపక్షిలా కూలిపోయిన గూటికి వేళ్లాడుతూ నా ఖర్మ నేను అనుభవిస్తాను. పొండి! నేనేమైపోతే ఎవరికేంటి? అన్నం తినాలా? ఎందుకు? కొత్త బట్టలా? సంక్రాంతి ఏమన్నా పండగా? చదువా? ఉద్యోగమా? పూలు పెట్టుకోవాలా? ఎవర్ని ఉద్ధరించటానికి?

సముద్రం కూడా నాలా ఒంటరిదే. నాలాగే ఆకాశాన్నీ ఆకాశంలో చంద్రుణ్ణి అందుకోవాలని అలల్ని విసురుతూ ఉంటుంది. ప్రతిసారీ భంగపడుతూ ఉంటుంది. నేను నీకు అందను అని నింగిలోంచి వాడు నవ్వుతూనే కవ్విస్తూనే ఉంటాడు. ఇదొక ఆట అయిపోయింది వాడికి. ఎన్నిచోట్ల ఎన్ని సముద్రాల్ని ఇలా రెచ్చగొడతాడు? చివరికి వాడు కూడా ఆకాశంలో ఒంటరి వెధవగానే మిగిలిపోతాడు.

ఏంటీ దాహం నాకు? ఎవ్వరికీ అక్కర్లేని సన్నాసి విషయాల గురించి తర్జన భర్జన పడతాను. ఇప్పుడేమైంది? దిస్ ఇజ్ జస్ట్ నార్మల్ ఇన్ దిస్ ఏజ్. ప్రతి విషయం సీరియస్‌గా తీస్కోకు మోహీ. లివ్ దిస్ మొమెంట్. ఈ క్షణం బ్రతుకు. ఆస్వాదించు. లే! నీకోసం ఎన్ని వసంతాలు ఎదురుచూస్తున్నాయి? ముళ్లబాటలో ఉన్నావు. ఇంకొక్క అడుగు వేయి. నందన వనం నీదే! గాయం అయితే మందు వేసుకోవాలిగానీ గుండెనే పెకలించి వేస్తావా? నిన్ను నువ్వు తెలుసుకో. ఎంతసేపూ ఆ అబ్బాయిల మోహాలు

తప్పా నీ ముఖం ఎలా ఉంటుందో నీకు తెలుసా? గెట్ అప్, స్టెప్ అప్. కాయిన్‌కి బొమ్మే చూశావు. ఇప్పుడు బొరుసు చూడు. థర్డ్, కుదిరితే ఫోర్త్ డైమన్షన్ కూడా చూడు. యు ఆర్ ద క్వీన్ ఆఫ్ యువర్ లైఫ్ మోహీ!

వివేకానందుడు ఏం చెప్పాడు? యు ఆర్ ది మేకర్ ఆఫ్ యువర్ డెస్టినీ. టాగోర్ ఏమన్నాడు? వేర్ ది మైండ్ ఇజ్ వితౌట్ ఫియర్, వేర్ ది హెడ్ ఇజ్ హెల్డ్ హై, లెట్ మై మోహీ ఎవేక్ ఇన్ దట్ సాలిడారిటీ. అవును, ఇది నా లైఫ్. పవన్‌ది కాదు, చందూది కాదు. దే ఆర్ ఆఫ్టరాల్ పార్ట్స్- టైనీ, ట్రివియల్ పార్ట్స్. యు ఆర్ మాగ్నిఫిసెంట్. ఏదో సినిమాలో హీరోయిన్ పాడుకుంటుంది- మై ఆప్ హీ అప్నీ ప్రేమికా అని. కరెక్టే. ముందు నిన్ను నువ్వు ప్రేమించుకుంటే ఫస్ట్ ఆఫ్ ఆల్ లోటు తెలియదు.

సెకండ్లీ, ఎదుటివాళ్లు నిన్నెలా ప్రేమించాలో నీకు తెలుస్తుంది. నీ రిక్వైర్‌మెంట్ చెప్పగలవు.

✤

కొత్త అధ్యాయం షురూ. మోహిత తాజా గులాబి. ఒక మోహతరంగం. సమ్మోహనాస్త్రం. మలయపవన ఛురిక. అందంలో మెరిక. దయ, జాలి, కరుణ లాంటి పదార్థాలేమీ లేకుండా యువకుల్ని హతమార్చటానికి వచ్చిన ప్రేమగుళిక. ముందు అందమైనది, తెలివైనది; తరువాత పొగరుబోతు, అహంభావీ లాంటి బిరుదులూ వచ్చాయి. హూ కేర్స్?

✤

డేటింగ్‌కి రమ్మన్నాడు చందు ఫ్రెండ్ బాబ్‌గాడు. ఐ హేట్ యు అని ముఖం మీదే చెప్పాను. డేటింగ్‌కి లవ్ హేట్‌తో పన్లేదు అని వెకిలి నవ్వొకటి నవ్వాడు. వాడి మగతనం మీద వాడికి నమ్మకం కలగడానికి ఒక ఆడది హెల్ప్ చెయ్యాలిట! ఈ పని చేసేవాళ్లు వేరే ఉంటారని చెప్పుతో కొట్టినంత పని చేశాను. వాడికి మించినది ఆశిస్తూ ఉంటే నవ్వొచ్చేది. తర్వాత యు.ఎస్. వెళ్లిపోయాడు. ఈపాటికి వాడి మీద వాడికి బాగా నమ్మకం కుదిరి ఉంటుంది.

ఎదురింటి యువరాజ్ నేను షటిల్ ఆడుతుంటే జిమ్ కిటికీలోంచి దొంగ చూపులు చూసేవాడు. నా ధాటికి తట్టుకోలేక కిందమీదులయ్యేవాడు. ముదిరిపోతున్నాడని గోలపెడితే ఇంట్లో వాళ్లు రెండు నెలల్లో పెళ్లి చేసేశారు. బాగా భయపెట్టేశాను అని ఇప్పటికీ నవ్వుకుంటూ ఉంటాను.

టీమ్మేట్ చరణ్‌గాడు నేను స్విమ్మింగ్ చేస్తుంటే ఐదో అంతస్తు కిటికీలోంచి చూసేవాడు. మరదలితో పెళ్లయి కూతురు పుట్టింది. ఊళ్లో ఆడవాళ్లందరికీ కూతుళ్లు పుట్టించాలన్న ఏకైక ధ్యేయంతో అచ్చోసిన ఆంబోతులా తిరుగుతూ ఉంటాడు. నేనంటే చాల ఇష్టం(ట). ఎంతమందిని చూసినా నేనంటే మాత్రం ఎందుకో పార్షియాలిటీట. పళ్లు నూరుతూ కసిగా మాట్లాడుతూ ఉంటాడు. నా లవ్ స్టోరీలో ఎప్పటికైనా విలన్ అంటూ ఉంటే అది వీడయ్యే అవకాశం ఎక్కువే.

వంశీ మైక్రోసాఫ్ట్‌లో పని చేస్తున్నాడు. కాలేజీలో ఎంత మెతకగా ఉండేవాడంటే గట్టిగా రెండుసార్లు నీ పేరు పుల్లయ్య అంటే ఒప్పేసుకునేవాడు. నా సైలెంట్ అడ్మైరర్స్‌లో ఒకడు. ఒకరోజు ఫోన్‌లో కాంటాక్ట్స్ క్లియర్ చేస్తూ అతని నెంబర్ పని చేస్తోందో లేదో అని కాల్ చేశాను. ఎత్తాడు. చాలా అబ్బురంగా, సంతోషంగా పలకరిస్తాడనుకున్న నాకు నిరాశే ఎదురైంది.

"ఊ చెప్పు!"

రెండు సంవత్సరాల తరువాత ఫోన్ చేసిన ఫ్రెండ్‌తో మాట్లాడే మొదటి మాట అది!? ఫలానా చోట ఉద్యోగమనీ, ఒక్కదాన్నే ఉంటున్నాననీ చెప్తే కొంచెం తత్తర పడ్డాడు.

"ఏదైనా హాస్టల్లో ఉండచ్చు కదా!"

"హాస్టల్ లైఫ్ బోర్ కొట్టింది. వ్యక్తిగత సామాన్లకే కాదు, వ్యక్తులకీ భద్రత వుండదు. ఇల్లు అంటే మనదీ అనిపించాలి. పగలంతా అలిసిపోయి రాత్రికి ఒక రెక్లూజ్ వెతుక్కుంటున్నప్పుడు నా ఒళ్లో సేద తీరు అనిపించే వాతావరణం ఉండాలి."

హి కట్ మి అండ్ బ్లర్టెడ్ ఔట్. "ఆర్ యు స్టిల్ ఎ వర్జిన్?"

ఈ అబ్బాయిలందరికీ ఇదేం పాడు క్యూరియాసిటీ?

"వాట్ ఇజ్ ద హోల్ పాయింట్ ఆఫ దిస్ బ్లడీ క్వశ్చన్?"

"ఒక్కదానివే ఉంటున్నానన్నావు కదా, ఎవరైనా బాయ్ ఫ్రెండ్ ఉన్నాడేమో అని అడిగాను అంతే. ఎందుకైనా మంచిది, కొంచెం జాగ్రత్త!" బోడి సలహా ఒకటి.

✤

ఇవన్నీ తరుణ వయస్సులో ఉన్న శరీరం చేసే మాయ తప్ప మనసు ప్రమేయం లేదని తొందరగానే గ్రహించాను. ఇది కాదు నాక్కావల్సింది. ఇదే నాతో ప్రాబ్లం! ఫలానా వద్దూ అని చెప్పగలుగుతున్నాను కానీ ఇదిగో ఇదే నాక్కావాలి అని చెప్పలేకపోతున్నాను. ఇది నా మందకొడితనమా లేక ఐడియలిజంలో తప్ప

రియాలిటిలో ఉండనిదా? అసలు నాకేం కావాలి? అవధులు లేని స్నేహమా? స్నేహంతో ప్రమేయం లేని ప్రేమా? ప్రేమ వాసన తగలని స్నేహమా? స్నేహం, ప్రేమ లేని పెళ్లా? అమలిన శృంగారమా? ఇవన్నీ కలిసిపోయిన ఒక అనుబంధమా? ఇవేవీ లేని కాలక్షేపపు సంబంధమా? స్నేహంలా పరిచయమై ప్రేమగా మారి పెళ్లికి దారి తీసే లాంగ్‌టర్మ్ రిలేషనా? ఏం కావాలి నాకు?

✤

మెంటల్ స్టిమ్యులేషన్. ఈ పదం చాలా నచ్చింది. ఓహ్ శశి స్టోక్ మై ఫైర్. తెలివైన ఆడపిల్లలకి వచ్చే భర్త ఆత్మన్యూనతా భావంతో బాధపడతాడని మా మామయ్య కూతురు అంది ఒకసారి. అప్పుడు నాకు పదిహేనేళ్లు. ఆందోళన చెంది అమ్మకి చెప్పాను. అమ్మ వివరించింది.

"అది పల్లెటూళ్లో పెరిగిన పిల్ల. దాని పరిధి చాలా తక్కువ. పైగా టీవీ సీరియల్స్ ప్రభావం ఉంటుంది. తనమీద తనకి నమ్మకం లేదు. ఆడదానికి భర్తే సర్వస్వం అనుకునే ఆర్థోడాక్స్ పెంపకంలో పెరిగింది. నీకన్నా రెండేళ్లు పెద్దదైనా నీకున్న పరిపక్వత తనకు లేదు. మా బంగారుతల్లికి ఇంతకన్నా బంగారు బాబు వస్తాడు," అని ముద్దు పెట్టుకుంది.

నేను శాంతించాను. నా ఐ.క్యు. 126 ఉంటే ఏంటి 130, 140 ఐ.క్యులు దొరకరా? అయినా ఎప్పుడూ మగ ఎక్కువ, ఆడ తక్కువ అని రూలేమన్నా ఉందా? అంత ఇన్ఫీరియారిటీతో బాధపడేవాడు నాకు భర్త గావడమేంటి? అలాంటి మొగుడూ వద్దు మొద్దులూ వద్దు. నాకు ఐ.క్యు, ఈ.క్యులతో పనిలేదు. నన్ను నన్నుగా గుర్తించి నన్ను నన్నుగా ప్రేమించేవాడు కావాలి.

స్కర్ట్ వద్దు జీన్స్ వేసుకో, నల్లపూసల నెక్లెస్ వద్దు ఐదు తులాల మంగళసూత్రం వేసుకో, జట్టు విరబోయకు జడ వేసుకో- ఇలాంటివి పొసెసివ్‌నెస్ వల్ల రావు బాసిజం వల్ల వస్తాయి. ప్రేమ వల్ల రావు - భయం వల్ల వస్తాయి.

ఇంటికొచ్చిన అతిథుల ముందు అంతా బానే ఉన్నట్టు షో చేసి, వాళ్లు వెళ్లి పోయాక తలో దారీ అయిన సంసారాన్ని తల్చుకుని ఏడ్చే గృహిణులు నాకు తెలుసు. తమ అభిప్రాయాల్నీ, వ్యక్తిత్వాన్నీ చంపేసుకుని కాలి కింద చెప్పులా పడుండే ఆడ వాళ్లు, మగవాళ్లూ కూడా తెలుసు. కలిసి బతకటం అంటే జీవితాంతం మేపటం, దానికి సొల్యూషన్ పడగ్గదిలో కలవటం అనుకునేవాళ్లు ఉన్నారు. పెళ్లయి ఇరవై ఏళ్లయినా తాము నవమన్మథులమని పోకిరి వేషాలు వేసేవాళ్లూ ఉన్నారు. భార్య

మాత్రం కన్నెత్తి సినిమా పోస్టర్ వంక చూసినా చిరంజీవి బాగున్నాడా అంటూ మాటలతో హింసించేవాళ్లూ ఉన్నారు.

నేనేమీ ఫెమినిస్ట్‌ని కాదండీ. ఆడపిల్లగా పుట్టడం వల్ల సహజంగా జీవితాన్ని ఆ కోణంలోంచి చూస్తున్నాను.

అంతే!

✤

ఈ నొప్పులు ఎక్కువౌతున్నాయి. ఏదో బయటికి వస్తున్నట్టుంది. శశీ. నువ్వు పక్కనుంటే చాలా ధైర్యంగా ఉంటుంది. నీ శ్వాసతో నా చెమటలు అద్దు. చేతిలో చెయ్యేసి నేనున్నానని చెప్పు.

✤

ప్రేమంటే వెలుగు. ప్రేమంటే అవధులు లేని ఆనందం. డోంట్ ఫాల్ ఇన్ లవ్, రైజ్ ఇన్ ఇట్. లవ్ ఇజ్ ద లైట్ ఆఫ్ లైఫ్. నాకు తెలిసి ప్రేమంటే ఇంతే. నాకు తెలీని ప్రేమ- ప్రేమంటే దుఃఖమనీ, ప్రేమంటే విరహమనీ, ప్రేమంటే జీవిత కాలం చీకటిగృహంలో బందిఖానా అని. అప్పుడు ఇవన్నీ తెలిసుంటే అసలు ప్రేమించే దాన్నేకాదు శశీ. ఎనిమిదిసార్లు గుండె ముక్కలు చెక్కలయింది. అవన్నీ ఎగిరి ఎక్క డెక్కడో పడ్డాయి. ప్రతిసారీ వెతుక్కోవటం, అంటించుకోవటం. మెత్తగా ఉండే హృదయం ఈ అతుకుల బొతుకులతో గరుగ్గా మారిపోయింది శశీ. ప్రతిసారీ ఇది వరకటి కంటే నొప్పి తక్కువే. గాయం లోతూ తక్కువే. నేనూ తెలివిమీరాను మరి.

✤

*నువ్వెవరో నా గుండె ద్వారాన్ని ఎందుకు తట్టావో*
*నువ్వు మొత్తంగా నావాడివని చెప్పు -*
*నీ మీద సమస్త బ్రహ్మాండము నిండిపోయెంత ప్రేమ గుమ్మరిస్తాను*
*వలలన్నీ చెళ్లున తెగాయి ముక్కలై తునాతునకలై*

నిన్ను చూశాకే ఎందుకో మళ్లీ మనసివ్వాలనిపించింది. ఈ కార్పొరేట్, మెటీరియలిస్టిక్ ప్రపంచం నుంచి దూరంగా నీ దగ్గర తలదాచుకోవాలి అనిపించింది. ఆఫీసులో క్షణమైనా తీరిక లేకుండా గడుపుతాం మనం. నువ్వు నన్ను ఇంటి దగ్గర దింపి, మాస్క్ తీసేసి నువ్వు నువ్వుగా, నేను నేనుగా అసలైన రూపాలతో గడిపే ఆ పదిహేను నిముషాల ప్రయాణం కోసం ఎంత ఆర్తిగా ఎదురుచూస్తుంటానో తెలుసా?

✤

'గెస్ ద పర్సనాలిటీ' గేమ్ ఆడాం గుర్తుందా? అందరూ మైకేల్ జాక్సన్, జార్జ్ బుష్, రికి పాంటింగ్ అడిగితే నువ్వు పింగళి వెంకయ్య అడిగావు. అక్కడ నువ్వూ నేనే తెలుగువాళ్లం. ఆ ప్రశ్నకి నేను మాత్రమే జవాబు చెప్పగలనని నీకు తెలుసు. గ్రూప్‌లో ఆడుతూ కూడా గురిచూసి నాకే సంధించావే, అదీ ఎవరికీ తెలియకుండా...? ఆ ధైర్యం నాకు నచ్చింది.

కాఫెటేరియా టీవీలో అందరూ ఐపిఎల్ రెప్పవెయ్యకుండా చూస్తున్నారు. కారంగా ఉన్న బిసిబెళ బాత్‌ని ఎలా తినాల్రా దేవుడా అనుకుంటున్నాను. సడన్‌గా నా వంక తిరిగి, 'ఏంటీ కారంగా ఉందా?' అనడిగావు. ఆశ్చర్యపోయాను. నువ్వు నన్ను చూడకపోయినా నేనేం ఆలోచిస్తున్నానో, ఏం ఫీల్ అవుతున్నాను నీకెలా తెలుసు శశీ? ఫ్రీక్వెన్సీ మ్యాచ్ అయింది కదా!

బైక్ మీద, 'మై హార్ట్ ఇజ్ బీటింగ్,' అని పాడుకుంటూ సడన్‌గా పాట ఆపి, "ఈ రోడ్ అంటే నాకు చాలా ఇష్టం. చాలా రొమాంటిక్‌గా ఉంటుంది. అదీ... ఒక అమ్మాయితో వెళుతున్నప్పుడు ఇంకా..." అన్నావా లేదా? అప్పుడు నేను తప్ప ఇంకో అమ్మాయి ఉందా అక్కడ?

"రోజూ ఇలానే పాటలు పాడుకుంటూ వెళతావా?" అడిగాను.

"ఆ, ఒక్కణ్నే ఉంటాను కదా. ఐ లవ్ మ్యూజిక్. మనసులోని భావాన్ని ఒక్కోసారి పాటలే చెప్పగలవు. అలాంటివంటే నాకిష్టం."

నా కళ్లు మెరిశాయి. ఈ మెటీరియలిస్టిక్ ప్రపంచంలో నా పర్ఫెక్ట్ మాన్ దొరకడనుకున్నాను. ఇప్పుడు ఆశ మొదలైంది.

✤

"బావను పెళ్లి చేసుకోవటం నీకిష్టమేనా," నాన్నడిగారు.

"నా ప్లేన్ ఆఫ్ థాట్ భూమికి 30 వేల అడుగుల ఎత్తులో వెళుతుంటుంది. దానికి మ్యాచ్ అయ్యే ఆ స్పీడ్ అందుకునే వాళ్లు కావాలి."

"పెద్ద పనే పెట్టావు," అని నవ్వారు.

శశీ- పేరుకి తగ్గట్టే చల్లని స్నేహం కురిపించావు. ఎన్ని రాష్ట్రాల, భాషల వాళ్లని చూసినా, ఎంతమంది విదేశీయులతో పరిచయమున్నా కలగని అపూర్వ భావన నాకు నీ దగ్గరే ఎలా కలిగింది? నీ అనురాగపు జల్లుల్లో తడిసి ముద్దైపోయాను. నన్ను నేను ఆరబెట్టుకోవటానికి జీవితకాలం సరిపోదేమో.

✤

నా బెస్ట్ ఫ్రెండ్ తాహెరా నాలోని మార్పుని గమనించింది. 'క్యోం ఖోయా ఖోయా లగ్ రహే హో?" అని అడిగేసింది. నా దగ్గర అంత చనువు తనకే ఉంది.

"కుచ్ నహీ యార్. నథింగ్," అన్నాను. నా పెదవులపై దాగని నవ్వూ కళ్లల్లో దాచలేని నునుసిగ్గూ తనకి అర్థమైపోయేలా చేశాయి.

"వాట్స్ హిజ్ నేమ్?"

చెప్పాను. "డోంట్ బ్రేక్ యువర్ హార్ట్ అగైన్."

"ఐ లాస్ట్ మై లాజిక్ ఇన్ దిస్ కేస్. హీ స్వెప్ట్ మీ ఆఫ్ మై ఫీట్. ఐ డోంట్ వాంట్ టు గెట్ అప్."

కొన్ని గాయాలు, నెత్తుటి మరకలు తీయని జ్ఞాపకాలు. తీసెయ్యలేం, తుడిచెయ్యలేం.

✤

శశీ ఇది చిత్రవధ శశీ.

ఎవర్ని చూసినా నీలాగే కనిపిస్తుంటే ఏంచేయాలో తెలీక ఇంటికొచ్చేసి తలుపులు బిగించుకుంటున్నాను. వలపు తలపులు తలుపులు బాదుతుంటే తీయలేని బేలతనం. తీయకుండా ఉండలేని నిస్సహాయత. ఎవరు నువ్వు? నాకేమౌతావంటే నా దగ్గర సమాధానం లేదు. ముక్కలై పుట్టిన ఆత్మలో ఒక సగం నువ్వూ ఇంకో సగం నేనూ అని చెప్పనా? ఆరోజు వర్షంలో నన్ను మా ఇంటి దగ్గర దింపి తిరిగి వెళ్తూ నీ పాదముద్రలు తడి ఇసకలో కాదు, నా హృదయమ్మీద వేశావని చెప్పనా? నీ పిల్లలకి తల్లిని కావాలనుందని చెప్పనా? నా ప్రయాణంలో నువ్వు తోడయ్యావు, జత కుదిరాక మళ్లీ ఒంటరిగా సాగలేనని చెప్పనా?

✤

నా అరుపులు, కేకలు ప్రతిధ్వనిస్తున్నాయి.

'శశీ... శశీ...'

నాకు తెలిసిన గాయత్రి మంత్రం, పరమ రహస్యం నీ పేరే. నిన్ను చూసిన ముహూర్తంలో అస్సలు అనుకోలేదు- నా ఆనందం ఇంతగా నీమీద ఆధారపడి ఉందని! నువ్వు తెలియకముందు శుభ్రంగా, నా మానాన నేను ప్రశాంతంగా వున్నాను.

తెలిశాక ఇంకా తెలుసుకోవాలనిపించింది. నా లైఫ్‌లో లేట్‌గా కలిశావు. అప్పటికే నీకొక గర్ల్ ఫ్రెండ్ ఉంటే అది నాదా తప్పు?

✤

యు మేక్ మీ ఫీల్ లైక్ డాన్సింగ్. నాకెంత కోరికో నీతో బాల్ చెయ్యాలని. ఫాస్ట్ బీట్ సల్సా అయినా ఓకే. నీ చేతుల్లో నేను. ఓహ్! ఈ ఆలోచనే ఎంత మధురంగా ఉందో !

మా టీమ్ మీటింగ్ ఉందని ఒకరోజు ఆఫీసు అవర్స్ తర్వాత ఆగిపోయాను. అప్పుడు జరుగుతున్న పెయింటింగ్ పోటీలో నువ్వు పార్టిసిపేట్ చెయ్యటం గ్లాస్ డోర్‌లోంచి చూశాను. ఏవియేషన్ జర్నల్ పేజీలు తిరగేస్తూ అక్కడే కూర్చుండి పోయాను. ఎంత శ్రద్ధగా దీక్షగా ఆ బొమ్మ వేశావు? అది నా హృదయంపై గీసిన బొమ్మ. ఎత్తైన కొండలు, పచ్చని పచ్చిక, గలగల సెలయేరు, పక్కనే ఒక రెండు జళ్ల అమ్మాయికి ఆకాశంలో చంద్రుణ్ణి చూపిస్తూ ఒక అబ్బాయి. ఉప్పొంగిన అలలు నా హృదయమైతే నీ చిత్రం నాలో సునామీ రేపిందోయ్. నువ్వు వెనక్కి తిరిగితే నేను కనపడతానని వెళ్లిపోయాను. చాలు శశీ. ఆ క్షణాలు చాలు!

✤

నాకు చాలా వింతగొలిపే విషయమొకటి చెప్పనా? ఆ రాత్రి అప్పుడే వాన వెలిసింది. రివ్వున వీస్తున్న చలిగాలికి బైక్ స్పీడ్ కూడా తోడైంది.

"నా చెయ్యి పట్టుకో," అని అడిగావు.

"ఎందుకు?"

"చలికి చల్లగా అయిపోయింది."

"నాకేం అనిపించటం లేదు."

"ఛ."

"నిజంగా నాకు నువ్వు అడ్డం ఉన్నావు కదా."

గబుక్కున కిందకి వంగావు. కసుక్కుమని గాలి నన్ను కోసినట్టే తాకింది.

"ఓవ్," అరిచాను.

"అర్థమైందా? పట్టుకో."

సంకోచంగా ఇచ్చిన నా కుడిచేతిని ఎంత దర్జాగా నీ ఎడమచేత్తో పొట్ట మీద వేసుకున్నావు? గాంధర్వ వివాహ తంతు అదేగదా! నీ వీపుకి నా తల ఆనింది. దాంతో పాటే పెదవులు.

"దగ్గరికి జరుగు."

అబ్బా ఇంకెంత దగ్గరికి? ఇప్పటికే సైడ్ ఏంగిల్లో చూస్తే నా ముందు భాగం ఎంత ఫ్లాట్ అయిపోయిందో తెలుస్తుంది.

"నిన్నొక పర్సనల్ క్వశ్చన్ అడగచ్చా?"

"అడుగు."

"నువ్వు షర్టు లోపల ఏమీ వేసుకోవా?"

ఓ క్షణం బిత్తరపోయావనుకుంటా, బైక్ స్లో అయింది. బహుశా ఫస్ట్ టచ్/హగ్‌లో ఏ ప్రేమికుల మధ్యా ఇలాంటి సంభాషణ జరిగి ఉండదు. ఏదో గొణుక్కున్నావు. నాకు సిగ్గు పోయి నవ్వొచ్చింది.

ఇక మౌనం. చొక్కాని పిడికిట్లో బిగించి అల్లాగే... ఐ వజ్ లాస్ట్. ఎన్ని కిలో మీటర్లు దాటామో ఎన్ని గంటలు గడిచాయో తెలీదు. ఎప్పటికో పాట విని కళ్లు తెరిచాను. సాగర సంగమంలో 'మౌనమేలనోయి' అంటున్నావు. నిట్టూర్చాను. నా ఊపిరిలో తేడా పసికట్టావనుకుంటా- పాట ఆపి,

"ఓయ్ దిగు, మీ ఇల్లొచ్చింది," అన్నావు.

"ఎంతసేపైంది?"

"టెన్ మినిట్స్ అనుకుంటా. నాకు నిద్రొస్తుందమ్మా, దిగు వెళతా!"

నాకెందుకో నిన్ను అస్సలు వదలాలని లేదు. చెయ్యి తీస్తే చేతికందిన ఏ అమృతభాండమో జారిపోతుందన్నంత బెంగగా ఉంది. కౌగిలి వీడితే మనం కలవటం అదే ఆఖరిసారి అని మనసులో అదృశ్యవాణి పలకటం మొదలైంది. కలవరంగా దిగాను. బై కూడా చెప్పకుండా వెళ్లిపోయావు. నేనక్కడే నుంచున్నాను. నా పెన్నిధిని ఎవరో ఎత్తుకుపోయారన్నంత దిగులుగా అనిపించింది.

నెమ్మదిగా గేటు దాటి లోపలికి వెళ్లబోయాను. ఇప్పటికీ ఆశ్చర్యం కలుగుతుంది అది తలచుకుంటే. నా కాళ్ల మధ్య తడి లేదు. అంటే, ఇప్పటివరకూ నేను ఉన్నది ఆ భావనలో కాదా? అదేదో ఫీలింగ్. మోహం, మాయ, మత్తు- ఇవేమీ కాదు. ఇవన్నీ కలగలిసిపోయిన ఇంకేదో భావం. మోహితనే ముంచేసిన మర్మం. నా ఒంటరితనాన్ని మరపింపజేసిన అనుభూతి. ఆలింగన స్పర్శలోని దైవత్వం. ఎనిమిదిమంది చంద్రులు చెయ్యలేని ఒక అద్భుతం. పది సంవత్సరాల నుంచి కలత నిద్రపోతున్న నేను ఆ రాత్రి ఊహించలేనంత ప్రశాంతంగా, కలలు లేని నిద్ర అనుభవించాను.

✤

నాకనిపించింది నిజమే. అదే మేం ఆఖరిసారి కలవటం. నవ్వులు తప్ప ఇంకేం తెలియని అమాయకురాల్ని ఏడిపించాడు. నేనతని వెంటపడుతున్నానని ఎవరో అన్నారని పురుగుని చూసినట్టు చూశాడు. మెయిల్ పంపాడు ఐ యామ్ నాట్ ద రైట్ పర్సన్ ఫర్ యూ అని. అది డిసైడ్ చేసుకోవాల్సింది నువ్వు కాదు నేను అని రిప్లై కొట్టాను. నాతో మాట్లాడటం ఇష్టం లేదని తప్పించుకు తిరిగాడు. సిగ్గు విడిచి నేనే అతని దగ్గరికి వెళ్తే ఏదో పనున్నట్టే లిఫ్ట్‌లోకి వెళ్లిపోయి మొహం మీదే డోర్స్ క్లోజ్ చేశాడు. అంత తిరస్కారం నేను భరించలేకపోయాను.

ప్రేమని పంచే వాళ్లకి ద్వేషం పంచటం చేతకాదు. ద్వేషం తట్టుకోవటం అస్సలు చేతకాదు. ఆ ఆఫీస్‌కి ఇంక వెళ్లాలనిపించలేదు. అప్పటి నుంచి మొదలయ్యాయి ఈ నొప్పులు. శశి ఫ్రెండ్ అనుష్‌కి చెప్పాను జరిగిందంతా.

"ఆల్రెడీ జీ.ఎఫ్.ని ఉంచుకొని నీతో అలా ఎలా బిహేవ్ చేస్తాడు? అయినా వాళ్లు పెళ్లి చేసుకోబోతున్నారు. నువ్వే అతిగా ఊహించుకున్నావేమో."

అంతగా ఏడవగలనని నాకే తెలీనంతగా ఏడ్చాను. డ్రైవర్ విన్నాడు ఫోన్లో నా సంభాషణ. లాంగ్‌డ్రైవ్‌లాగా అలా వెళ్లిపోయాడు ఇంటికి తీసుకెళ్లకుండా. ఆ విషయం ఒక అరగంట గడిచాక అద్దంలోంచి చూస్తున్న నాకు స్ట్రైక్ అయింది.

"అదేంటీ? ఇది ఇంటి దారి కాదు కదా."

"మీ మనస్సు బాలేనట్టుంది. అందుకే కొంచెం రిలీఫ్‌గా ఉంటుందేమో అనీ..." అని నసిగాడు.

నా మెంటల్ కండిషన్ అర్థం చేసుకున్నందుకు కృతజ్ఞతలు చెప్పాను. ఇక ఇంటికి తీసుకెళ్లాడు. బొచ్చెడుమంది స్నేహితులు ఉండక్కర్లేదు. అర్థం చేసుకునే వాళ్లు ఒకళ్లిద్దరు ఉన్నా ఆ మనిషి అదృష్టవంతుడే!

✤

మూడురోజుల పాటు అన్నపానీయాలు సహించలేదు. గోడకి చేరగిలబడి అలానే కూర్చుండిపోయాను. వీకెండ్‌కి వాళ్లింటికి రాలేదేమని పిన్ని ఫోన్ చేస్తే బలవంతంగా వెళ్లాను. నాకన్నా తను చాలా పెద్దది. అయినా స్నేహితుల్లా ఉంటాం. జరిగినదంతా చెప్పాను.

"ఏ కారణం చేత అతనలా చేశాడో తెలీదు."

"అబ్బాయిలకి ఎన్నో ప్రాబ్లెమ్స్ ఉంటాయి. వదిలెయ్."

తాహెరాకి చెప్పాను.

"నిన్ను యూస్ చేసుకుందాం అనుకున్నాడు. నువ్వు ఆ ఛాన్స్ ఇవ్వలేదు. లైట్ తీస్కో."

అమ్మకి చెప్పాను.

"ఎందుకు నీకా వ్యవహారాలు? అయినా బైక్ మీద ఎక్కి ఆ లీనియెన్స్ ఇచ్చింది నువ్వే. మర్చిపో ఇంక."

డాక్టర్ తమ్ముడు "లవ్ ఇజ్ ఎ సిండ్రోమ్, యు ఆర్ ఇన్ డిప్రెషన్. అందులో ఇవన్నీ కామన్. అయినా వాడు నిన్నేమన్నా పెళ్లి చేసుకుంటానని చెప్పి మోసం చేశాడా? లేకపోతే మీ రిలేషన్ డీప్ అయ్యాక నీ చేతిలోంచి డబ్బులు గుంజి వదిలేశాడా? ఏమీలేదు! రెండుసార్లు బైక్ మీద దింపాడు. దానికే నువ్వింత డిప్రెస్ అవ్వటం బాలేదు. ఎలాంటిదానివి, ఎంత నిరాశగా మాట్లాడుతున్నావు? జస్ట్ లీవ్ ది ఎంటైర్ మేటర్," అన్నాడు.

✤

ఎనిమిది గాయాలు భరించాను. తొమ్మిదోది భరించే ఓపికలేదు దేవుడా, గాయం అవ్వకముందే ఈ ముడి విప్పెయ్. అతనూ ఆ ఉద్యోగం మానేశాడు. ఎక్కడున్నాడో ఏం చేస్తున్నాడో. తమ్ముడు చెప్పిన వాటిలో ఏవీ అతను చెయ్యకపోయినా అంతకన్నా ఎక్కువే చేశాడు. మెంటల్ స్టిమ్యులేషన్. అలా పరిచయమైన వాళ్లని బహుశా కోటి జన్మల్లో కూడా మర్చిపోలేం.

సైకలాజికల్‌గా చేసే టచ్‌కి చాలా పవర్ ఉంటుంది. ఎనిమిది గాయాల్ని మాన్చి అంతకన్నా పెద్ద గాయం చేసే పవర్ ఉంటుంది.

✤

అంతా నువ్వేపోయాక నాకేం మిగల్లేదు శశీ. ఎన్ని రాత్రులు ఒంటరిగా ఏడ్చానో, తిన్నానో తినలేదో, ఎలా ఏడ్చి ఏడ్చి నిద్రపోయానో, తెలవారుతూనే ఆ ఏడుపుకి ఎలా చిరునవ్వుల ముసుగులేసి రోజులు గడిపానో నాకు మాత్రమే తెలుసు. ఎవరన్నా హిప్నటైజ్ చేసి ఇవన్నీ మర్చిపోయేలా చేస్తే ఎంత బాగుండు! లేదా మెదడులో ఆ జ్ఞాపకాలున్న ముక్కను కోసి పారేస్తే ఎంత బాగుండు! నువ్వు లేనిదంతా శూన్యమనీ, వ్యర్థమనీ చాలా ఇండైరెక్ట్‌గా చెప్పావు. నా మాగ్నెట్‌కి నిన్ను ఆకర్షించే శక్తి లేదని నిరూపించావు. నా మనసు పరీవాహక ప్రాంతం మీద అడ్డుకట్ట వేసి- అక్కడే- నీ దగ్గరే- నీ చుట్టూనే- నా ఆలోచనలు సుడిగుండంలా తిప్పేస్తున్నావు. గ్రేట్- ఆ టాలెంట్ నాకే ఉంటేనా, నీ వయసు అబ్బాయిలందర్నీ పాదాక్రాంతం చేసుకునేదాన్ని. సెలెక్టివ్ మేటింగ్‌కి చూజ్ చేసుకునేదాన్ని. స్వయంవరంలో ఎంచుకునేదాన్ని.

✤

ఐ యామ్ ఆల్వేస్ ఎ వన్-మాన్ ఉమన్ అనుకున్నాను. మనసులో అతనికి కమిట్ అయిపోయాను. సిన్సియర్‌గా ఒక్కడి కోసం వెతుకుతూ తొమ్మిదిమందిని నా మనసుదాకా రానిచ్చి పొరపాటు చేశానేమో. మనుషుల్ని అర్థం చేసుకునే ప్రయత్నంలో ఇప్పుడిప్పుడే లోకం చూస్తూ ఎదుగుతున్న నన్ను నేను అర్థం చేసుకునే ప్రయత్నంలో ఉన్నాను. సింపుల్‌గా చెప్పాలంటే నాలోని ప్రశ్నలకి ఎదుటి మనిషిలో సమాధానం వెతుకుతున్నాను. శశిని చూశాక, మై క్వెస్ట్ హాజ్ ఎండెడ్, ఐ ఫౌండ్ మై గ్రెయిల్ అనుకున్నాను.

✤

కెవ్వున కేక!

మొత్తం బయటికి వచ్చేసింది.

"అమ్మా!"

నేనరిచింది మీకు బహుశా శశీ అని వినపడి ఉంటుంది. చెవిటివాళ్లలారా, నేనరిచింది అమ్మా అనే. ఐదు సంవత్సరాల మూగ బాధ మొత్తం బయటకి కక్కేశాను కదా. శాశ్వతంగా ద ఎండ్ చెప్పేశాను శశికి. ఓహ్ గాడ్! ఐ యామ్ సో రిలీవ్డ్.

అబ్బా! ఇప్పుడెంత ప్రశాంతంగా ఉందో. చనిపోయిన పేషెంట్‌కి కనెక్ట్ చేసిన ఈ.సి.జి మెషిన్‌లా ఎంత సైలెంట్‌గా ప్రశాంతంగా అసలు ఏమీ జరగనట్టే నిర్మలంగా ఉంది! ఆలోచనలు లేక కాలం ఆగిపోయినట్టు, ఆగి మళ్లీ కదిలినట్టు, జీవన స్రవంతిలో నిత్య నూతనంగా వెలుతురు పరుచుకుంటున్నట్టు. ఏంటిది? ఇది మన కథ శశీ, గుండె కవాటాలు బద్దలు కొట్టుకొని బయటపడింది. నన్ను నీ పంజరంలోంచి బయటపడేసింది. థాంక్యూ. థాంక్యూ.

✤

పడటం కాదు, పడి లేవటం ముఖ్యం. ఆకాశంలో చందమామ అందదని తెలిసీ అర్రులు చాచాను. చేతులకంటిన దుమ్మునే చంద్రుడనుకున్నాను. ఇప్పుడు చేతులు దులుపుకోవటం నేర్చుకున్నాను. చందమామను అద్దంలో చూసి మురిసి పోవటం తప్ప అందుకోలేమని గ్రహించాను. ఒక చాప్టర్ క్లోజ్ చేసి ఇంకో చాప్టర్ ఎలా ఓపెన్ చెయ్యాలో నేర్చుకుంటున్నాను. నేను ఎప్పటికీ నా పర్ఫెక్ట్ మాన్‌కే కమిట్ అయి ఉంటాను. దొరక్కపోతే అది మగజాతి ప్రాబ్లం. నాది కాదు. అందుకే ఇప్పుడు సంతోషంగా ఉన్నాను. తొమ్మిది కాకపోతే పది, పది కాకపోతే వంద. మై ఆప్షన్స్ ఆర్ ఓపెన్.

వయసు మించిపోతోంది.

అడ్డు తప్పుకోండి.

*పాలపిట్ట మాసపత్రిక*
*మార్చి 2015*

❋



12 జూన్ 1987న పుట్టిన మోహిత మొదటి కథ అర్ధశతాబ్దపు అజ్ఞానం జూన్ 2014 కౌముది.నెట్ అంతర్జాల పత్రికలో ప్రచురితమయ్యింది. మూసి మాసపత్రిక కాలమ్ నిర్వహించారు. ఆంధ్రప్రభ వారపత్రికలో ఒక కాలమ్ నిర్వహించారు, కొన్ని కవితలు ప్రచురించారు. కొన్ని కథలను ఇతర భాషల నుండి తెలుగులోకి అనువదించారు. ఆలిండియా రేడియోలో రేడియోజాకీగా పనిచేస్తున్నారు.

*చిరునామా: ఫ్లాట్ నెం. 303, ప్లెసెంట్ టవర్స్, మెథడిస్ట్ చర్చి ఎదురుగా, హైదర్గొకోట, హైదరాబాద్ - 500 091.*
*ఫోన్: 98859 07062 kaundinya.mohita08@gmail.com*